గరంగరంగా గ్రామసభలు

● మూడోరోజూ గందరగోళం

ప్రజాపాలన గ్రామసభల్లో మూడోరోజూ గందరగోళం నెలకొంది. గురువారం అధికారులు గ్రామసభలు నిర్వహించి ప్రజాపాలనలో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న వారి జాబితాలోని అర్హులైన వారి పేర్లను సభలో ప్రకటించారు. తమ పేర్లు రాలేదంటూ లబ్ధిదారులు అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అర్హుల ఎంపిక ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, జాబితాలో పేరు రాలేదని ఎవరూ ఆందోళన చెందవద్దని అన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన గ్రామసభలు మూడోరోజూ గరంగరంగా, రసాభాసగా జరిగాయి. గురువారం మండలంలోని తాటికొండ, ఇప్పగూడెం, తానేదార్‌పల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలను నిర్వహించారు. ఆయా సభల్లో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం ప్రతిపాదించిన పేర్లను చదువుతుండగా గతంలో వచ్చిన వారికే వచ్చాయని పలువురు ఆరోపించారు. ఈ విషయమై ప్రజలు అధికారులను నిలదీశారు. ఇప్పగూడెంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నాయకుల మధ్య స్వల్ప వాగ్వివాదం జరిగింది. అనంతరం అధికారులు మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికలో ఏమైనా అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా అందించాలన్నారు. సభల్లో ఆర్డీఓ డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ విజయశ్రీ, ఎంపీఓ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. తాటికొండ గ్రామసభను డీసీపీ రాజమహేంద్రనాయక్ పరిశీలించారు.


ఇప్పగూడెంలో వాగ్వావాదం చేసుకుంటున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు

పరస్పర విమర్శలు

బచ్చన్నపేట : బండనాగారం, బోనకొల్లూర్, కొడవటూర్, నక్కవానిగూడెం, గంగాపూర్‌లో నిర్వహించిన గ్రామ సభల్లో గ్రామస్తులు పేర్లు జాబితాలో రాలేదని అధికారులను నిలదీశారు. అలాగే పలు పార్టీల నాయకులు పరస్పర విమర్శలతో గొడవపడ్డారు. భూమి ఉన్న వారి పేర్లు ఆత్మీయ భరోసా జాబితాలో వచ్చాయని కొడవటూర్‌లో, గ్రామంలో లేని వారికి రేషన్ కార్డులు వస్తున్నాయని బోనకొల్లూర్‌లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది.

ప్రొటోకాల్ రగడ

కొడకండ్ల : మండల పరిధి కొడకండ్ల, రామవరం, ఏడునూతుల గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు అధికారుల నిలదీత, నిరసనలతో హోరెత్తాయి. అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడంపై ప్రజలు మండిపడ్డారు. పోలీసులు జోక్యం చేసుకొని శాంతింపజేశారు. దీనికి తోడు మండల కేంద్రంలో ప్రొటోకాల్ రగడ నెలకొంది. అర్హత లేని వారు వేదికపై ఆసీనులవ్వడంపై పలువురు నిలదీశారు.

నిరసనలతో నిలిచిన గ్రామ సభ

నర్మెట: మండల పరిధి గుంటూర్‌పల్లి, ఇప్పలగడ్డ, ఇసుబాయితండా, మచ్చుపహాడ్‌లలో గురువారం గ్రామ సభలు జరిగాయి. మచ్చుపహాడ్‌లో ప్రజలు అధికారులను నిలదీయడంతో అర్ధాంతరంగా సభ ముగిసింది. లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా లేదని ఏకపక్షంగా ఒకే పార్టీకి చెందిన వారికి లబ్ధిచేకూరేలా ఎంపికలు జరిగాయని సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు రామిని శివరాజ్ గుప్తా, ప్రజలు అధికారులను నిలదీశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పేర్లు రానివారు తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపినా ప్రజలు శాంతించక పోవడంతో అధికారులు వెళ్లిపోయారు.

నిలదీతల మధ్య..

దేవరుప్పుల: రాష్ట్ర ప్రభుత్వం పథకాల అర్హుల జాబితా ఆమోదింపజేసేందుకు తలపెట్టిన గ్రామసభలు నిలదీతల మధ్య కొనసాగాయి. మండలంలోని గొల్లపల్లి, లకావత్‌తండా దేవునిగుట్ట, రామచంద్రాపురం, చిప్పరాళ్లబండతండా, ధారావత్‌తండా, సింగరాజుపల్లి, ధర్మగడ్డ, నల్లకుంటతండాల్లో అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. గొల్లపల్లి, దేవునిగుట్టతండాలో నిలువ నీడలేని పేదలను విస్మరించి అనర్హులను ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో చేర్చారని ఆరోపించారు. ఈ విషయమై స్థానిక ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ప్రస్తుత ఎంపిక జాబితాలో అనర్హులు ఉంటే చెప్పడమేగాక అర్హులుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో శాంతించారు.

అధికారులపై ఆగ్రహం..


పోతారంలో అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న గ్రామస్తులు

తరిగొప్పుల: పోతారం, బొత్తలపర్రె, నర్సాపూర్, మాన్‌సింగ్‌తండాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. సంక్షేమ పథకాల జాబితాలో తమ పేర్లు రాలేదని, ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అనర్హుల పేర్లే అధికంగా ఉన్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులను నిలదీశారు.

పాలకుర్తిలో రసాభాస

పాలకుర్తి/పాలకుర్తి టౌన్: మండలంలో మూడో రోజు ప్రజాపాలన గ్రామసభలు రసాభాసగా జరిగాయి. పాలకుర్తి, గూడూరు, గోపాలపురం, హరిజన కాలనీ, గుడికుంటతండా, ముత్తారం, శాతపురం, వావిలాల, చీమలభాయి తండా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో తమకు సంక్షేమ పథకాలు మంజూరు కాలేదని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ప్రజాసంఘాల నాయకులు సభలో అనర్హుల పేర్లు ఎక్కువగా ఉన్నాయని, అర్హులందరికీ పథకాలు అందించాలని అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందుతాయన్నారు.

ఆన్‌లైన్ ఎందుకు చేయలేదు..?


రఘునాథపల్లి గ్రామసభలో అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

రఘునాథపల్లి: ప్రజాపాలన కార్యక్రమంలో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకుంటే వాటిని ఎందుకు ఆన్‌లైన్ చేయలేదని మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి కవితపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దె ఇళ్లలో ఉంటున్నా జాబితాలో పేర్లు ఎందుకు రాలేదని మండిపడ్డారు. సర్వేలో అద్దె ఇంటి ముందు ఫొటో తీసుకుని అది సొంత భవనమని పేర్కొన్నారని మహిళలు ధ్వజమెత్తారు. జాబితాలు తప్పులతడకగా తయారు చేశారని అధికారులను చుట్టుముట్టి వాగ్వాదం చేయడంతో గ్రామ సభ గందరగోళంగా మారింది. అదే సమయంలో డీసీపీ మహేందర్‌నాయక్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి చేరుకొని గ్రామస్తులను సముదాయించారు.

దరఖాస్తులు ఎక్కువ.. అర్హులు తక్కువ


నెల్లుట్ల గ్రామసభలో ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు

లింగాలఘణపురం: సంక్షేమ పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి.. అర్హుల జాబితాలో కొంత మంది పేర్లే ఉన్నాయి. దీంతో నెల్లుట్ల, పటేల్‌గూడెం, వడిచర్ల, నవాబుపేట, మంథోనిగూడెం, ఏనెబావి గ్రామసభలో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ భూములు ఉన్నవారి పేరు ఎలా వచ్చిందని ప్రజలు మండిపడ్డారు. అలాగే రేషన్‌కార్డులపై కూడా ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఏఓ వెంకటేశ్వర్లు సూచన మేరకు తిరిగి దరఖాస్తు అందజేశారు.

ఉప్పుగల్లులో..


అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

జఫర్‌గఢ్: జాబితాలో అర్హుల పేర్లు లేవంటూ ఉప్పుగల్లు గ్రామ సభలో ప్రజలు, బీఆర్‌ఎస్ నాయకులు అధికారులను నిలదీశారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంత మంది నాయకులు ఇచ్చిన పేర్లను మాత్రమే అధికారులు లబ్ధిదారులుగా జాబితాలో చేర్చారంటూ బీఆర్‌ఎస్ నాయకుడు నాయిని నరేశ్ అనడంతో.. వాగ్వాదానికి దిగిన బీఆర్‌ఎస్ నాయకులు నాయిని నరేష్, పులి ధనుంజయ సభా వేదిక ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఎస్సై రామ్‌చరణ్ వారికి నచ్చజెప్పి శాంతింపజేశారు.

క్లుప్తంగా

ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్



జనగామ రూరల్: సంక్షేమ పథకాల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతంగా చేయాలని అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన సందర్శించి ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. తప్పులు లేకుండా సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ సంపత్ కుమార్, డేటా ఎంట్రీ ఈజీఎస్ ఆపరేటర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



జనగామ: పట్టణంలోని కుర్మవాడకు చెందిన ఆలేటి చంద్రయ్యకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం డీసీసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అందజేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పాలన సాగుతుందన్నారు.

'ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న కాంగ్రెస్'

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్నారని, నియోజకవర్గంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎన్నికల ముందు చేసిన హామీలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్నగుప్తా అన్నారు. తానేదార్‌పల్లిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు అర్హులకే ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఏఎంసీ డైరెక్టర్ కుమారస్వామి, పద్మారెడ్డి, సుధాకర్, మహిపాల్‌రెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీహరిని విమర్శిస్తే సహించేది లేదు

● యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు క్రాంతికుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే రాజయ్య అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని, మరోసారి విమర్శలు చేస్తే సహించేది లేదని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బోనాసి క్రాంతికుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు ఇల్లందుల విజయ్, ఉపాధ్యక్షుడు నీలం యువరాజ్ అన్నారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాపోలు శివచరణ్‌రెడ్డి అధ్యక్షతన డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కడియం శ్రీహరి ఎన్నికల ముందు ప్రజలకు చేసిన హామీల మేరకు అభివృద్ధే ప్రధాన ఎజెండాగా పార్టీ మారారని, ఏడాదిలోనే రూ.750 కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులు షేక్ జానీబాబా, సంపత్, రంగు రమేష్, ప్రదీప్, సందీప్, ప్రవీణ్, ఇస్రం రాజు, రామకృష్ణ, మనోజ్, మునీర్, భరత్ పాల్గొన్నారు.

సన్మానం



దేవరుప్పుల: ఇటీవల సోఫ్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వహించిన సైన్స్, మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభచాటి బంగారు పతకాలు సాధించారు. ఈ క్రమంలో వారిని గురువారం పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు సన్మానించి అభినందించారు.

మేకకు ఐదుపిల్లలు జననం



పాలకుర్తి : మండలంలోని మల్లంపల్లి గ్రామంలో దేవరాయ లక్ష్మికి చెందిన మేకకు గురువారం ఐదు పిల్లలు జన్మించాయి. మేకకు ఐదు పిల్లలు పుట్టడంతో గ్రామస్తులు వచ్చి ఆసక్తిగా చూస్తున్నారు. మేకలు సహజంగా ఒకటి నుంచి మూడు పిల్లలు వరకు జన్మిస్తాయని, కానీ ఐదు పిల్లలు పుట్టడంతో జన్యుపరంగా జరుగుతుందని పశు వైద్యాధికారి డి.అశోక్‌రెడ్డి తెలిపారు. అవి ఆరోగ్యంగా ఉండేందుకు మేకకు కాల్షియం సిరప్ వాడాలన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో మహా అన్నదానం


అన్నదానాన్ని ప్రారంభిస్తున్న నరసింహులు, రామిని హరీశ్

జనగామ: జిల్లా కేంద్రం ఆర్టీసీ చౌరస్తా పోలీస్ కంట్రోల్ రూం ఆవరణలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ విద్య, మానవ వనరులు, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదినం పురస్కరించుకుని గురువారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ రామిని హరీశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో పార్టీ పొలిట్ బ్యూరో మెంబర్, తెలంగాణ మాజీ అధ్యక్షుడు బక్కని నరసింహులు, విశిష్ట అతిథిగా భువనగిరి పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు కుందారపు కృష్ణాచారి పాల్గొని ప్రారంభించారు. అంతకు ముందు కేక్‌కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. వెయ్యి మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మయ్య, నాయకులు శ్రావణబోయిన బాల్‌నర్సయ్య, సురుగు సతీష్‌గౌడ్, గుగులోత్ కనకరాజు, పరకాల శ్రీనివాస్, కడారు ప్రవీణ్, వృకోధర్‌రెడ్డి, నీలం స్వామి, తాళ్లపెల్లి ఎల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● ఆర్డీఓ డీఎస్ వెంకన్న


జఫర్‌గఢ్ రేగడితండా గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకన్న

జఫర్‌గఢ్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. మండలంలోని రేగడితండా జీపీ ఆవరణలో గురువారం నిర్వహించిన గ్రామ సభకు ఆర్డీఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాపాలనలో సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు గ్రామసభల్లో ప్రకటించిన లిస్టులో పేర్లు రాకుంటే ఆందోళన చెందకుండా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీఓ సుమన్, మండల వ్యవసాయ అధికారి కరుణాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలకు మొదటి ప్రాధాన్యం

జనగామ రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో నిరుపేదలకే మొదటి ప్రాధాన్యం ఉంటుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ అన్నారు. ఎర్రగొల్లపహాడ్ గ్రామం, పట్టణంలోని 15,17,18,19,20,21 వార్డుల్లో నిర్వహించిన సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, సేవాదళ్ రాష్ట్ర నాయకుడు సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

మళ్లీ దరఖాస్తు చేసుకోండి

జనగామ: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరు పేదలకు అందించే పథకాల జాబితాలో పేర్లు రాని పక్షంలో వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని 17వ వార్డు కౌన్సిలర్ జక్కుల అనితవేణుమాధవ్ అన్నారు. పట్టణంలోని జూబ్లీగార్డెన్‌లో అధికారి శ్రీకాంత్ పర్యవేక్షణలో నిర్వహించిన వార్డు సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. వార్డు అధ్యక్షుడు కమాలుద్దీన్, పిట్టల సతీష్, బేజడి కేశవులు, కూరపాటి రాజ్‌చంద్ర, కేమిడి స్వప్న, రాఘవేంద్ర ఉన్నారు. అలాగే 21వ వార్డులో నిర్వహించిన గ్రామసభలో కౌన్సిలర్ కర్రె శ్రీనివాస్ పాల్గొని జాబితాలో పేర్లు రాని వారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మామిడాల రాజు, ఉల్లెంగుల సందీప్, పాల్గొన్నారు.

దేవాదుల కాల్వ పరిశీలన


గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

జఫర్‌గఢ్: మండలంలోని తీగారం గ్రామ శివారులో ఉన్న దేవాదుల కాల్వను గురువారం ఎస్ఈ సుధీర్, డీఈ సంపత్, శేషగిరిరావు, ఏఈ యాసర్ గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. తీగారం రైతులకు సాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు కాల్వను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. కాల్వ ద్వారా ఏ మేరకు సాగునీరు అందించాలన్న విషయమై రైతులు, గ్రామస్తులతో చర్చించారు. మాజీ సర్పంచ్ గోనే జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గోనే రాజేష్‌కుమార్, ఎల్మకంటి స్వామి, కడారి భిక్షపతి, కలకోట అనిల్, సింగపురం అశోక్, రైతులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

● మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య


రఘునాథపల్లి: శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

రఘునాథపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, వాటిని ఎగవేసేందుకు చూస్తూ పోలీస్ పహారా మధ్య గ్రామ సభలు నిర్వహిస్తోందని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలోని తహసీల్ ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా చేపట్టిన దీక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతుబంధు ఎకరాకు రూ .15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి రూ.12 వేలే ఇస్తామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ఓట్లు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కే ఉందని, రానున్న పంచాయతీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలని, ఓట్ల కోసం కడియం శ్రీహరి గ్రామాలకు వస్తే తరిమి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. దీక్షలో నాయకులు వై.కుమార్‌గౌడ్, సేవెల్లి సంపత్, ఆకుల కుమార్, కేసిరెడ్డి మనోజ్‌రెడ్డి, ముసిపట్ల విజయ్, గవ్వాని నాగేశ్వర్, గూడ కిరణ్, మోరె మోహన్‌రావు, దుబ్బాక హరీష్, బొంగు ఐలయ్య, జిట్టె వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో బహుళ ప్రయోజనాలు


దేవరుప్పుల: నివాళులర్పిస్తున్న ఎస్సై తదితరులు

దేవరుప్పుల: క్రీడలతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని ఎస్సై ఊర సృజన్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రశాంతి విద్యానికేతన్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి పురస్కరించుకుని తలపెట్టిన ఖేలో భారత్ విద్యార్థుల క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. ముందుగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్, పాలకుర్తి నగర కార్యదర్శి దరావత్ శ్రవణ్, పీఇటీలు రవికుమార్, కృష్ణ, కార్యవర్గ సభ్యులు శివర్ల మహేందర్, వట్టిపల్లి గణేష్, కారుపోతుల నరేశ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

స్టేషన్‌ఘన్‌పూర్: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కార్తీక్ అన్నారు. ఖేలో భారత్ క్రీడోత్సవాల్లో భాగంగా ఏబీవీపీ ఘన్‌పూర్ మండల శాఖ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఏబీవీపీ మండల కన్వీనర్ పసునూరి సందీప్, ఉమర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

జనగామ రూరల్: స్వాతంత్య్ర సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా కానిస్టేబుల్ శాడ పోచయ్య పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గురువారం రక్తదానం చేశారు.

సంక్షిప్త సమాచారం

క్యాలెండర్ ఆవిష్కరణ

జనగామ రూరల్: జిల్లా పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. జెడ్పీ సీఈఓ మాధురి కిరణ్ చంద్రషా, డిప్యూటీ సీఈఓ ధూళిపాళ్ల సరిత, సంఘం నాయకులు వి.శ్రీనివాస్, చెన్నమల రమేష్, కూచన రాజు, వేణు, రాజేంద్రప్రసాద్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధించాలి

బచ్చన్నపేట : పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని జీసీడీఓ గౌసియా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను సందర్శించిన ఆమె కిచెన్‌షెడ్, సరుకులను పరిశీలించారు.

అర్హులకు ఇళ్లు అందించాలని రాస్తారోకో

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర సంక్షేమ పథకాల్లో అర్హులకు అన్యాయం చేస్తూ అనర్హులను ఎంపిక చేశారని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించాలని కోరుతూ స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బాధితులు గురువారం రాస్తారోకో చేపట్టారు. మాతంగి కుమార్, మారపాక శేఖర్ తదితరులు మాట్లాడారు.

ఆర్డీఓకు వినతి

ప్రభుత్వం అందజేస్న ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాల కోసం రీ సర్వే చేసి అర్హులైన పేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని కోరుతూ మండలంలోని ఇప్పగూడెం గ్రామసభలో ఆర్డీఓ డీఎస్ వెంకన్నకు సీపీఎం నాయకులు వినతిపత్రాన్ని అందించారు. రమేశ్, మల్లారెడ్డి, రాజు పాల్గొన్నారు.

'నిందితుడిని శిక్షించాలి'

జనగామ రూరల్: భార్యను హత్య చేసిన నిందితుడు గురుమూర్తిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐద్వా నాయకురాలు సౌందర్య అధ్యక్షతన జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్‌లో వెంకట మాధవిని భర్త గురుమూర్తి అతి కిరాతకంగా చంపడం దారుణమన్నారు. వెంటనే గురుమూర్తికి చట్టపరంగా శిక్ష విధించాలని డిమాండ్ చేశారు.

'పదేళ్లలో రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వలేదు'

పాలకుర్తి టౌన్: బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదేళ్లలో పేదలకు రేషన్‌కార్డులు ఎందుకు ఇవ్వలేదని పీసీసీ నాయకుడు గంగు కృష్ణమూర్తి ప్రశ్నించారు. గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాపాలనలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇస్తామంటే అడుగడుగునా బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకోవడం సరికాదన్నారు. నాగన్న, భార్గవ్, శ్రీనివాస్, వెంకన్న, యాకన్న పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

చిల్పూరు: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు డిమాండ్ చేశాడు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సరస్వతికి అందజేశారు. మండల కార్యదర్శి సాదం రమేష్, సభ్యులు పోలు సంపత్, ఆవుల ప్రభాకర్, కర్రె నాగరాజు, పురుమాని లింగయ్య, పోలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే లక్ష్యసాధన

దేవరుప్పుల: ఉన్నత విద్యాభివృద్ధి కోసం విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఆశించిన లక్ష్యసాధన అనివార్యమని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజినల్ చైర్మన్ సీహెచ్ రవీందర్‌రెడ్డి, కింగ్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రంజిత్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ధర్మాపురం హైస్కూల్‌లో లయన్స్, కింగ్స్ క్లబ్ జనగామ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ పాలకుర్తి ఆధ్వర్యంలో..

పాలకుర్తి: మండలంలోని గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ పాలకుర్తి ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పుల్లయ్య, రమణా రెడ్డి, రాంరెడ్డి, వెంకటరెడ్డి, సంతోష్, మహేంద్ర పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి రాజీలేని పోరాటం

కొడకండ్ల: ఉపాధ్యాయుల సంక్షేమం, సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ రాజీలేని పోరాటం చేస్తూ ముందుంటుందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోల్ల మహిపాల్‌రెడ్డి, నూకల ఎల్లారెడ్డి అన్నారు. గురువారం మొండ్రాయి ఉన్నత పాఠశాలలో నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులకు సర్వీస్ పుస్తకాలను అందించారు.

విద్యార్థులకు పోటీలు

జనగామ రూరల్: వందేమాతరం స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో 'రాజ్యాంగ ఉత్సవాలు' పేరిట ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు నల్ల రాహుల్ తెలిపారు. మొత్తం 80 మంది పాల్గొన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్, కార్తీక్, నాగేంద్ర పాల్గొన్నారు.

అభినందనీయం

చిల్పూరు: క్రీడాపోటీల నిర్వహణకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేతిడి నర్సింహారెడ్డి అన్నారు. గురువారం ఆ పాఠశాలలో చిల్పూరుగుట్ట ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు తండ్రి చక్రధర్‌రావు జ్ఞాపకార్థం విద్యార్థులకు క్రీడాపోటీలను ఏర్పాటు చేయగా హెచ్‌ఎం ప్రారంభించారు.

ఎస్సీ వర్గీకరణకు పాటుపడాలి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణకు పాటుపడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగ్యల ఉపేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు పైస రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో తలపెట్టిన లక్ష గొంతులు.. వేల డప్పుల ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నిరుపేదలందరికీ పథకాలు అందేలా చూడాలి

చిల్పూరు: గ్రామ సభల్లో ప్రకటించిన సంక్షేమ పథకాల అర్హుల జాబితాలో చాలా మంది పేర్లు రాలేదని, నిరుపేదలైన అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని బీజేపీ నాయకుడు మారేపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాజవరంలో పార్టీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామంలో పసుల లక్ష్మి మృతి చెందింది. కాగా, గురువారం బాధిత కుటుంబ సభ్యులను సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు. రామచంద్రయ్య, శ్రీనివాస్, రాములు, పరశరాములు, నర్సయ్య పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండంలోని కోమటిగూడెంలో గురువారం పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులకు పశువులకు చికిత్స అందించి రైతులకు మందులు పంపిణీ చేశారు.

'శ్రీహరికి మనోజ్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి'

చిల్పూరు: ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఇటీవల అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ నాయకుడు కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి బేషరతుగా ఆయనకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పాలబోయిన నరేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని శ్రీపతిపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.